# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నందున ఈఏపీ సెట్ ఇంజనీరింగ్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నత విద్యా మండలి పేర్కొంది.**
2. **విజయవాడ రైల్వే డివిజన్‌లో నిర్వహణ పనుల కారణంగా విజయవాడ మీదుగా నడిచే పలు రైళ్లను రద్దు చేశారు.**
3. **రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారి కోసం గన్నవరం విమానాశ్రయం వద్ద ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశామని కృష్ణా జిల్లా కలెక్టర్ తెలిపారు.**
4. **తెలుగు భాషకు చిరస్మరణీయ సేవలందించిన భాషా సేవకులు కొమర్రాజు వెంకట లక్ష్మణరావు జయంతి ఈ రోజు.**

============================

రాష్ట్రంలో వచ్చే నాలుగైదు రోజుల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిందని.. ఈఏపీ సెట్ ఇంజనీరింగ్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నత విద్యా మండలి కార్యదర్శి నజీర్ అహ్మద్ ఓ ప్రకటనలో కోరారు. ఈ క్రమంలో ఈ రోజు నుంచి 23వరకు ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు రాసే అభ్యర్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకునేలా ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుంచి 5 గంటల 30 నిమిషాల వరకు రెండు విడతలుగా పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

విజయవాడ రైల్వే డివిజన్‌లో జరుగుతున్న నిర్వహణ పనుల కారణంగా విజయవాడ మీదుగా నడిచే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు విజయవాడ పౌర సంబంధాల అధికారి నుస్రత్ మండ్రూప్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నుంచి జూన్ 4 వరకు రాజమండ్రి- విశాఖ పట్నం, 27 నుంచి జూన్ 3 వరకు మచిలీపట్నం- విశాఖపట్నం, తిరుపతి-కాకినాడ టౌన్ గుంటూరు-విశాఖపట్నం, గుంటూరు- రాయగడ, 19 నుంచి జూన్ 3 వరకు విశాఖపట్నం-మహబూబ్ నగర్, 27 నుంచి జూన్ 4 వరకు గుంటూరు-విశాఖపట్నం రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు.

---------------------------

రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారి కోసం గన్నవరం విమానాశ్రయం వద్ద ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. హజ్ యాత్ర శిబిరం నిర్వహణపై సంబంధిత

అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా నిన్న కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు గన్నవరం విమానాశ్రయం వద్ద, కేసరపల్లి గ్రామంలోని ఈద్గా జమా మసీదు వద్ద హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. యాత్రికుల కోసం అవసరమైన మౌలిక సదుపాయాలు, వైద్య శిబిరాలను, 108 అంబులెన్స్‌లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

---------------------------

భారత్ తొలి అణు పరీక్షను 1974 మే 18 ఉదయం 8 గంటల 5 నిమిషాలకు రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో నిర్వహించింది. ఈ పరీక్ష నిర్వహించి నేటితో 50 ఏళ్ల పూర్తి అయింది. అణు పరీక్షను విజయవంతంగా నిర్వహించి అమెరికా, సోవియట్ యూనియన్, బ్రిటన్, ఫ్రాన్స్, చైనాల సరసన భారత్ నిలిచింది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వంలేని దేశం అణు పరీక్ష నిర్వహించడం అదే మొదటిసారి. ఈ అణు పరీక్షకు 'ఆపరేషన్ స్మైలింగ్ బుద్ధా' అని పేరు పెట్టారు.

---------------------------

తెలంగాణలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఈఏపీ సెట్ ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి. ఫలితాలను తెలంగాణ విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం విడుదల చేశారు. అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షలకు 91 వేల 633 మంది విద్యార్థులు హాజరు కాగా, 82 వేల 163 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఇంజినీరింగ్ విభాగంలో 2 లక్షల, 40 వేల 618 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, లక్షా 80 వేల 424 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీలోనూ మొదటి రెండు ర్యాంకులు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు సాధించడం విశేషం.

---------------------------

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ– ఐఐటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష– జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు ఈ ఏడాది దేశవ్యాప్తంగా 1.91 లక్షల మంది నమోదు చేసుకున్నారని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టీఏ తెలిపింది. దేశవ్యాప్తంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను ఈ నెల 26న నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎన్‌టీఏ అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు రెండు విడతలుగా ఈ పరీక్షను నిర్వహిస్తారు.

---------------------------

ఫ్రాన్స్‌లో జరుగుతున్న 77వ కేన్స్ చలన చిత్రోత్సవంలో భాగంగా 55వ భారత అంతర్జాతీయ చిత్ర వేడుక – ఇఫీ అధికారిక గోడపత్రికను కేంద్ర సమాచార ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు నిన్న ఆవిష్కరించారు. ఈ ఏడాది భారతీయ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం నవంబర్ నెలలో గోవాలో జరుగుతుంది. కాగా కేన్స్ చిత్రోత్సవంలో భారత్ పర్వ్‌కు మన దేశం మొదటిసారి ఆతిథ్యం ఇస్తోంది. ఈ కార్యక్రమానికి 250 మందికి పైగా ప్రతినిధులు పాల్గొని ప్రపంచ వేదికపై భారతీయ సంస్కృతిని, సినిమాలను ప్రదర్శిస్తున్నారు.

---------------------------

తెలుగు భాషకు చిరస్మరణీయ సేవలందించిన భాషా సేవకులు కొమర్రాజు వెంకట లక్ష్మణరావు జయంతి ఈ రోజు. 1876 మే 18న ఉమ్మడి కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలు గ్రామంలో లక్ష్మణరావు జన్మించారు. తెలంగాణ,

మహారాష్ట్ర ప్రాంతాల్లో విద్యాభ్యాసం చేశారు. తెలుగులో 'జనరంజని' పత్రిక స్వయంగా నడిపించారు. స్త్రీ విద్యావ్యాప్తికి 'తెలుగు జనానా' పత్రికలో తన సోదరి బండారు అచ్చమాంబతో కలిసి అనేక రచనలు చేశారు. హైదరాబాదులోని 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం' స్థాపించడంలో 'విజ్ఞాన చంద్రికా మండలి', 'విజ్ఞాన చంద్రికా పరిషత్', 'ఆంధ్ర సారస్వత పరిషత్తు' వంటి సంస్థల నిర్వహణలోనూ ఆయన పాత్ర కీలకమైనది. 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం' ఆయనకు విశేష కీర్తిని తెచ్చిపెట్టింది. తెలుగులో చరిత్ర పరిశోధనలు, విజ్ఞాన రచనలు చేయడానికి కృషి చేసిన తొలి తరం విద్యావేత్తల్లో లక్ష్మణరావు ఒకరు.

-------------------------

ఎన్టీఆర్ జిల్లాలో ఖరీఫ్ సాగుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. నాగమణి తెలిపారు. జిల్లాలో మొత్తం 97 వేల 340 హెక్టార్ల విస్తీర్ణంలో ఖరీఫ్ పంటలు సాగు చేయనున్నట్లు చెప్పారు. ఇందులో 48 వేల 606 హెక్టార్లలో వరి, 39 వేల 368 హెక్టార్లలో పత్తి పండించనున్నారని, పెసలు, మినుము, కంది వంటి పప్పుధాన్యాలను, మొక్కజొన్న సాగు చేసేలా ప్రణాళికలు రూపొందించామని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలను రైతులకు సరఫరా చేయనున్నామని వివరించారు.

-------------------------

కృష్ణా జిల్లా మచిలీపట్నం నుండి అయోధ్యకు ప్రత్యేక బస్సు సర్వీసులను నుడుపుతున్నామని ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు తెలిపారు. మచిలీపట్నం నుంచి అయోధ్య బస్సులను నిన్న ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ పెద్దిరాజు మాట్లాడుతూ, ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. మచిలీపట్నం డివిజన్‌లో ప్రజల విజ్ఞప్తి మేరకు అయోధ్య ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సులు అయోధ్య మాత్రమే కాకుండా సింహాచలం, అరసవెల్లి, శ్రీకూర్మం, కలకత్తా, గయా, కాశి అనంతరం అయోధ్య చేరుకుంటుందని తెలిపారు.

-------------------------

డయేరియా వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని డయేరియా నివారణ చర్యలపై నిన్న అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని రామతీర్థం, యర్రగుంట్ల గ్రామాల్లో డయేరియా బాధితులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని సూచించారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు వ్యాధి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. త్రాగునీరు కలుషితం అవ్వడంవల్ల డయేరియా ప్రబలే అవకాశం వుందని త్రాగునీటి శుద్ధితో పాటు, మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

-------------------------

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన ఈరోజు శ్రీ గోవిందరాజస్వామి సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7 నుండి 9 గంటల వరకు వాహనసేవ వైభవంగా జరిగింది. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాల కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

-------------------------

వర్షాల కారణంగా దోమలు పెరిగే అవకాశం ఉన్నందున విజయవాడ నగరాన్ని శుభ్రంగా ఉంచాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను, సిబ్బందీని ఆదేశించారు. నిన్న విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను కమిషనర్ పరిశీలించి, పారిశుద్ధ్య నిర్వహణ చేస్తున్న సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరంలో వర్షాలు కురిసిన సమయంలో మరింత ప్రణాళికాబద్ధంగా పారి శుధ్య నిర్వహణ జరగాలని చెప్పారు. తాగు నీటి సరఫరాలో అంతరాయం రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

======================